క్లుప్తంగా

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ



నవగ్రహ విగ్రహాలు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠ, ఉప ఆలయాల ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి దేవతామూర్తుల ప్రతిష్ఠాపన చేశారు. వందలాది మంది భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో జరిగిన క్రతువులను కమిటీ నిర్వాహకులు కొత్తా వెంకటేశ్వరరావు, నిచ్చెనమెట్ల సత్యానారాయణ, చల్లా కిషోర్, కల్వ వెంకటేశ్వర్లు, పోలూరి విద్యాసాగర్, రాచమడుగు మహేష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

రైతులకు మినీకిట్ల పంపిణీ



రైతులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఏఓ

వెలుగోడు: స్థానిక రైతు సేవ కేంద్రంలో సన్న చిన్న కారు రైతులకు మినుము విత్తనాల మినీ కిట్లను ఏవో పవన్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ సన్నా చిన్న కారు రైతులు మొక్కజొన్న, సోయాచిక్కుడు సాగు అనంతరం రబీ సీజన్లో మినుము పంట వేసుకోవాలని సూచించారు. వీబీఎన్ 8 అను అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాలను రైతులు సాగు చేసుకోవాలని, ఒక్కో రైతుకు నాలుగు కేజీల విత్తనాల మినీ కిట్టుని ఉచితంగా ఇస్తున్నట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వీరభద్రుడు, వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగమణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న పోలీసులు

బండిఆత్మకూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఎస్ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలకు ఘనంగా వందనం చేశారు. అమరవీరుల జ్ఞాపకార్థం ఒక నిమిషం పాటు మౌనం పాటించారు.

అక్రమ మద్యం స్వాధీనం



బండిఆత్మకూరులో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సీఐ, ఎస్ఐ, సిబ్బంది

జూపాడుబంగ్లా: గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయులు తెలిపారు. సోమవారం మండలంలోని తంగడంచ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నల్లపోతుల అయ్యన్న ఇంటిపై ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్‌కానిస్టేబుల్ పద్మనాభం, కానిస్టేబుళ్లు శివన్న, సుధీర్, మధు దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి తెలంగాణకు చెందిన పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బండిఆత్మకూరు: మండల కేంద్రంలో ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి, సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో జక్కులి రమేష్ వద్ద నుంచి 44 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నేలకొరిగిన వరి పైరు



నేలకొరిగిన వరి పైరు

బండిఆత్మకూరు: సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి వెంగళరెడ్డిపేట, బి. కోడూరు, కడమల కాలువ గ్రామాల పరిధిలో వేల ఎకరాల్లో వరి పైర్లు నేలకొరిగాయి. పంట కోత దశలో ఉన్న సమయంలో పైర్లు నేల కొరగటాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పెట్టుబడి పెట్టిన తర్వాత, పంట ఇలా నేలవాలడం వల్ల గింజలకు మొలకలొచ్చే ప్రమాదంతో పాటు గింజ రాలిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా దిగుబడి పూర్తిగా తగ్గి నష్టపోయే పరిస్థితి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితులలో ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

మలుపులు.. మృత్యు పిలుపులు

- ప్రమాదకరంగా మండ్లెం–భాస్కరాపురం దారి
- తరుచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు

జూపాడుబంగ్లా: అసలే ప్రమాదకరమైన మలుపులు.. దీనికి తోడు రోడ్డుపైకి పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు చొచ్చుకుని రావడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మండ్లెం–భాస్కరాపురం గ్రామాల మధ్య ఏడు కిలోమీటర్ల మేర బీటీరోడ్డు ఉంది. ఈ రహదారి వెంట నిత్యం నందికొట్కూరు నుంచి మండ్లెం, భాస్కరాపురం, ప్రాతకోట వరకు ఆటోలు, ద్విచక్రవాహనాల దారులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే మండ్లెం, భాస్కరాపురం, మండ్లెం తండా గ్రామాలకు చెందిన ప్రజలు వ్యవసాయ పొలాలకు నిత్యం ఈదారి వెంటే వెళ్తుంటారు. ఈ దారిలో నాలుగు ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, రోడ్లు, భవనాలశాఖ అధికారులు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాల్లేవు. మలుపుల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించలేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ఎదురుగా వచ్చే వాహనం ఢీకొనే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ మార్గంలో ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. అయినా అధికారులు ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండ్లెం–భాస్కరాపురం దారిలో ప్రమాదరకంగా ఉన్న మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయటంతో పాటు మలుపుల వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



భాస్కరాపురం వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు




హెచ్చరిక బోర్డు లేని మలుపు



రోడ్డుపైకి వచ్చిన పిచ్చిమొక్కలు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



నేను నిత్యం మండ్లెం మీదుగా నందికొట్కూరు, ఆత్మకూరు, కర్నూలు వంటి ప్రాంతాలకు వెళ్లి వస్తుంటాను. మండ్లెం నుంచి భాస్కరాపురం వెళ్లే దారిలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని విధంగా ప్రమాదకరమైన మలుపులున్నాయి. మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలి.

–పుల్లయ్య, భాస్కరాపురం

ప్రమాదాలను నివారించాలి



నేను ద్విచక్రవాహనంపై నిత్యం జూపాడుబంగ్లా, మండ్లెం, నందికొట్కూరు ప్రాంతాలకు వెళ్లివస్తుంటాను. మండ్లెం నుంచి భాస్కరాపురం వెళ్లే మార్గంలో ప్రమాదకరమైన మలుపులున్నాయి. మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డు లేవు. ఈ మలుపుల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలి.

–రమేష్‌బాబు, భాస్కరాపురం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పగిద్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. ప్రజల వ్యక్తిగత సమస్యలు, భూపరమైన సమస్యలతో పాటు ఇతర సమస్యలుంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

జూపాడుబంగ్లా: పల్లెపండుగ కార్యక్రమం పూర్తయినందున పంచాయతీలకు మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. మండలంలోని జూపాడుబంగ్లా, పారుమంచాల, మండ్లెం, తూడిచెర్ల, తాటిపాడు గ్రామాలకు రూ.2.55 కోట్ల జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద సిమెంటు రోడ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. జూపాడుబంగ్లాకు రూ.70 లక్షలతో 11 సిమెంటు రోడ్లు, పారుమంచాలకు రూ.42 లక్షలతో ఆరు సిమెంటు రోడ్లు, మండ్లెం రూ.67.5 లక్షలతో తొమ్మిది సిమెంటు రోడ్లు, తూడిచెర్లకు రూ.41 లక్షలతో ఏడు సిమెంటు రోడ్లు, తాటిపాడుకు రూ.28.5లక్షలతో మూడు సిమెంట్ రోడ్లకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. వంద రోజుల్లో పనులు పూర్తిచేయాలన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే నష్ట నివారణ



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఓ

కొత్తపల్లి: అధిక వర్షాలతో పంట నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతినకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వరిపంటలో నిల్వ ఉన్న నీటిని బయటకి పంపాలన్నారు. దీనికి 20 కేజీల యూరియా, 20 కేజీల ఎంఓపీ వేయడం వల్ల పంట త్వరగా పుంజుకుంటుందని తెలిపారు. ఈ వాతారణంలో ఆశించే తెగుల్ల నివారణకు కార్బండిజం, మాంకోజెబ్ తగిన నమోదులో కలిపి పిచికారీ చేసుకునే విధంగా రైతులకు తెలియజేయాలన్నారు. అదేవిధంగా మినుము పంటలో నీటిని త్వరగా బయటకు తీసివేసి 1 శాతం 19–19–19, 13–0–45 పిచికారీ చేసుకోవాలని చెప్పారు.

నేటి నుంచి గ్రామ సభలు

జూపాడుబంగ్లా: సమగ్ర రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈనెల 22వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పి.లింగాపురం, తంగడంచ, తరిగోపుల, తర్తూరు, తాటిపాడు గ్రామాల్లో రీసర్వే జరిగినట్లు చెప్పారు. పి.లింగాపురం గ్రామస్తులకు రీసర్వే అనంతరం పట్టా పాసుపుస్తకాలు ఇవ్వగా మిగిలిన గ్రామాల రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో తప్పొప్పులు, మార్పులు చేర్పులు ఉంటే గ్రామ సభల దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఈనెల 22న ఘణపురం(పోతులపాడు), 23న పి.లింగాపురం, 24న తంగడంచ, 25న తరిగోపుల, 26న తర్తూరు, 29న తాటిపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: మండలంలో మంగళవారం నుంచి జరిగే గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. పొలాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకునేందుకు రైతులకు ఇదో చక్కని అవకాశమని పేర్కొన్నారు. ఈ నెల 22న భానుముక్కల, 23న ఇస్కాల, 24న మద్దూరు, 25న తుమ్మలూరు, 26న వాడాల గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని వెల్లడించారు.

బండిఆత్మకూరు: ఈనెల 22 నుంచి వచ్చే 12వ తేదీ వరకు బండిఆత్మకూరు మండల గ్రామాల్లో భూముల రీ సర్వేపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దోనీ ఆల్ఫ్రెడ్‌సోమవారం తెలిపారు. 22న బోధనం, 23న ఏ.కోడూరు, 24న బి.కోడూరు, 25న కాకనూరు, 26న నారాయణాపురం, 29న పరమటూరు, వచ్చే నెల 1వ తేదీన పార్నపల్లె, పెద్దదేవళాపురం, 2న సంతజూటూరు, 5న ఎర్రగుంట్ల గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

వెలుగోడు మండలంలో

వెలుగోడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ తెలిపారు. 22న బోయిరేవుల, 23 మోతుకూరు, 24 అబ్దుల్లాపురం, 25 గుంతకందాల, 26 రేగడగూడూరు గ్రామాలలో సభలు ఉంటాయన్నారు.

ఆత్మకూరు మండలంలో..

ఆత్మకూరురూరల్: భూముల రీ సర్వేలో ఏమైనా సమస్యలుంటే ఆయా గ్రామాల్లో జరిగే గ్రామసభల్లో అర్జీలు ఇవ్వ వచ్చని ఆత్మకూరు తహసీల్దార్ జి.రత్న రాధిక తెలిపారు. ఈ నెల 22న కరివేన గ్రామ సచివాలయంలో, 23 కృష్ణాపురం, 24 నల్లకాల్వ, 25 పిన్నాపురం, 26 సిద్దాపురం, 29 సిద్ధపల్లె, 30న వడ్లరామాపురం గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారన్నారు.

రీ సర్వే పూర్తయిన చోట్ల గ్రామ సభలు

నందికొట్కూరు: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో సభల వివరాలు వెల్లడించారు. 22న అల్లూరు, 23న బిజినవేముల, 24న 10 బొల్లవరం, 25న బ్రాహ్మణకొట్కూరు, 26న దామగట్ల, 29న కొణిదేల, 30న మద్దిగట్ల, నవంబరు 1న శాతనకోట, 2వ తేదీ వడ్డేమాన్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తునట్లు తెలిపారు. రీ సర్వేకు సంబంధించిన సమస్యలు ఉంటే గ్రామ సభలో అర్జీలు ఇవ్వాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

వెలుగోడు: మండల పరిధిలోని అబ్దుల్లాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కే నటరాజన్(53) గుండెపోటుతో ఆదివారం మతి చెందాడు. ఈనెల మూడో తేదీన బండి ఆత్మకూరు నుంచి బదిలీపై అబ్దుల్లాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా వచ్చి విధులు నిర్వహిస్తున్నాడు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ వేల్పుల జైపాల్, గ్రామ కార్యదర్శులు సుంకన్న, నాగరాజు, నాగేశ్వర రెడ్డి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు మృతదేహానికి పూల మాలు వేసి నివాళులర్పించారు

ప్రత్యేక ఆధార్ క్యాంపు వాయిదా

పాములపాడు: మండలంలో ఈ నెల 22 (మంగళవారం) నుంచి నిర్వహించాల్సిన ప్రత్యేక ఆధార్ క్యాంపును వాయిదా వేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో 13 గ్రామ సచివాలయాలున్నాయని చెప్పారు. కాగా ఆధార్ నమోదు, సవరణకు మిట్టకందాల, చెలిమిల్ల, ఇస్కాల సచివాయాల్లో మాత్రమే మెటీరియల్ ఉందన్నారు. ప్రస్తుతం ఇస్కాల గ్రామంలో ప్రింటర్, మిట్టకందాల, చెలిమిల్ల గ్రామాల్లో ఐరీస్ మిషన్లు పనిచేయడం లేదన్నారు. ఈ విషయాన్ని డీఎల్‌డీఓ శివారెడ్డికి సమాచారం అందించామని చెప్పారు. ప్రత్యేక ఆధార్ క్యాంపును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

కొత్తపల్లి: గ్రామాల్లో మంగళవారం నుంచి నిర్వహించే రెవెన్యూ గ్రామ సభల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మండలంలో భూ రీసర్వే పూర్తయిన మూడు గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 22న కొత్తపల్లి, 23న నందికుంట, 24న శివపురంలో సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

వెలుగోడు: మండలంలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వెలుగోడు మండల విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నాయకులు ఎం శివశంకర్, ఎస్ కిషోర్, ఎం గణేష్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ వెలుగోడు మండలంలోని ఎయిడెడ్ జూనియర్ డిగ్రీ కళాశాలను ప్రైవేటుపరం చేసి పేద మధ్యతరగతి విద్యార్థులకు చదువును దూరం చేశారని, మండల పరిధిలో ఉన్న విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇతర ప్రాంతాలకు పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు



హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, పండితులు, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

భక్తిశ్రద్ధలతో రుద్ర, చండీ హోమాలు

మహానంది ఆలయంలో సోమవారం రుద్ర, చండీ హోమాలు వైభవంగా నిర్వహించారు. రవిశంకర్ అవధాని, ఆంజనేయ శర్మ, హనుమంత శర్మ ఆధ్వర్యంలో స్థానిక యాగశాలలో పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించిన అనంతరం ప్రత్యక్ష, పరోక్ష సేవలో పాల్గొన్న భక్తుల ఆధ్వర్యంలో హోమాలు చేపట్టారు.

కొనసాగుతున్న రద్దీ

మహానంది ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సోమవారం ఈశ్వరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది.

మహాసభలను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్

నందికొట్కూరు: డిసెంబర్ నెల 9, 10వ తేదీల్లో జరిగే జిల్లా సీపీఎం రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని మండలాల్లో ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. దళారుల చేతిలో మొక్కజొన్న రైతులు మోసపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఏసురత్నం, రత్నమయ్య, నరసింహ, శోభరాణి పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తప్పనిసరి



గొర్రెలకు నట్టల మందు తాగిస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు: వర్షాలకు గొర్రెలు, మేకలకు వ్యాధులు ప్రబలకుండా నట్టల నివారణ మందు తప్పనిసరిగా తాగించాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్యతో జీవాలకు నట్టల నివారణ మందును తాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వివిధ రకాల వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా నట్టల నివారణ మందు తాగించడం జరుగుతోందన్నారు. సకాలంలో మందులు తాగించకుంటే జీవాలు మృతిచెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థకశాఖ నంద్యాల డివిజన్ ఉప సంచాలకులు, సహాయక సంచాలకులు పార్థసారథి, శ్రీనివాసరావు, వరప్రసాద్, షణ్ముకరాజు, నవీన్‌కుమార్‌రెడ్డి, నిర్మలాదేవి పాల్గొన్నారు.

పనులు కల్పించకుంటే చర్యలు తప్పవు



ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ మేరి హెచ్చరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి రోజు 100 మంది కూలీలకు తగ్గకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. పనులు కల్పించలేని వారు స్వచ్ఛందంగా తప్పుకోవాలన్నారు. ముందుగానే కొత్త పనులు గుర్తించాలని సూచించారు. ఈనెల 31వ తేదీ గ్రామ సభలు నిర్వహిస్తారని.. కొత్త పనులకు అంచనాలు సిద్ధం చేసి గ్రామ సభల్లో తీర్మానం పొందాలని తెలిపారు. పనులు కల్పించడంలో అలసత్వం వహిస్తే సహించబోమని హెచ్చరించారు. మండలాన్ని మొదటి స్థానంలో ఉంచేందకు అందరూ కృషి చేయాలని సూచించారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చెంచులు

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు, కొత్త సిద్దేశ్వరం గ్రామాల్లోని చెంచులకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయించాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు స్వాములు, చెంచు సంఘం నాయకుడు పుల్లన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు ఆర్డీఓ ఎం.దాసు, జూపాడుబంగ్లా తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా గ్రామాల్లో సుమారు 60 చెంచు కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. వీరికి ఐటీడీఏ, రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఇప్పటి వరకు ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేయకపోవడంతో పూరిగుడిసెల్లోనే తలదాచుకుంటున్నట్లు తెలిపారు. అలాగే జీవనోపాధి కోసం పొలం కొనుగోలు చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



కోళ్లబావాపురంలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు చేస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జఫ్రుల్లా హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరంపై ఎక్సైజ్ శాఖ ఎస్ఐలు, పోలీసులు దాని వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రిమినల్ కేసులతో పాటు వాహనాలు సీజ్ చేసి జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. ఎక్సైజ్ శాఖ హెడ్‌కానిస్టేబుల్ పద్మనాభం, పోలీసులు శివన్న, సుధీర్, మధు తదితరులు పాల్గొన్నారు.

కాటమరాజు దేవాలయ నిర్మాణానికి కృషి



కాటమరాజు విగ్రహానికి పూజలు చేస్తున్న యాదవ సంఘం నాయకులు

వెలుగోడు : వెలుగోడు రిజర్వాయర్ మద్రాస్ కాలువ వద్ద ప్రతిష్ఠించిన కాటమరాజు విగ్రహానికి దేవాలయం నిర్మించేందుకు రాష్ట్ర స్థాయి నాయకుల సహకారంతో కృషి చేస్తామని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు తెలిపారు. సోమవారం కాటమరాజు విగ్రహానికి అఖిల భారత యాదవ మహాసభ నాయకులు నాగేశ్వరావు యాదవ్,ఎస్ రఘు రాముడు యాదవ్, రాజలింగయ్య యాదవ్, శివుడు పూజలు చేశారు. వారు మాట్లాడుతూ గతంలో ఈ విగ్రహం బండి ఆత్మకూరు అనంతయ్య పొలములో ఉండేదని, 1983లో రిజర్వాయర్ నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసిన తర్వాత ఈ ప్రాంతాన్ని మునుక భూములుగా గుర్తించి తెలుగంగ అధికారులు విగ్రహాన్ని గట్టు తండా రస్తాలో మద్రాసు కాలువ వద్ద ఏర్పాటు చేశారని చెప్పారు. ఇక్కడ దేవాలయ నిర్మాణానికి కొరకు దాతలు దాతలు ముందుకు రావాలని కోరారు.

డ్రైనేజీలు నిర్మించాలని వినతి

పాములపాడు: గ్రామాల్లో వర్షపు నీరు రోడ్లపై నిలిచి ఇబ్బందిగా మారుతోందని.. డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. మద్దూరు గ్రామ పంచాయతీ మాజారా క్రిష్ణానగర్ గ్రామానికి చెందిన నరసింహులు, నాగేశ్వరరావు, చెలిమిల్ల గ్రామానికి చెందిన శివప్రసాద్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓను కోరారు. ప్రధాన రహదారుల్లో సైతం వర్షపు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

జూపాడుబంగ్లా: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. ఈనెల 22న పారుమంచాల, 23న తరిగోపుల, 24న 80బన్నూరు, 25న తాటిపాడు గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డులో పేర్లు, పుట్టిన తేదీ, చిరునామా, ఫోన్‌నెంబర్, లింగం తదితరాల చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. జూపాడుబంగ్లా, మండ్లెం సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు కేంద్రాలున్నాయన్నారు. వాటిల్లో మండ్లెం ఆధార్ కేంద్రం పరికరాలు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు.